
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్నూలు
జిల్లా వార్తలు
సోమవారం 19 ఫిబ్రవరి 2024





అధికారం ఉందన్న అహంకారం.. ఎవరిపై ఎలాంటి దాడులు చేసినా ఏం కాదులే అన్న ధీమా అన్నింటికీ 'అన్న' ఉన్నాడన్న బరితెగింపు వెరసి అనంతపురం జిల్లా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి కారణమైంది. నిజాలు నిర్భయంగా రాస్తుంటే తట్టుకోలేక.. అధికారం చేజారిపోతోందన్న భయంతో వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. ఆదివారం సాయంత్రం రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై తెగబడ్డాయి. ఈ ఘటనను రాజకీయ, ప్రజాసంఘాలు, జర్నలిస్టుల యూనియన్లు తీవ్రంగా ఖండించాయి.

అధికార మదం


- 'అనంత'లో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి
- సీఎం జగన్ 'సిద్ధం' అని ప్రసంగించగానే రెచ్చిపోయిన వైసీపీ అల్లరి మూకలు
- ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై విచక్షణారహితంగా దాడులు
- ఖండించిన రాజకీయ, ప్రజా సంఘాలు
- నేడు జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, ఆందోళనలు
- పిలుపునిచ్చిన ఏపీయూడబ్ల్యూజే

కర్నూలు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభ కవరేజీ కోసం వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ రౌడీ మూకలు దాడి చేయడం అధికార మదానికి నిదర్శనమని ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నాయకులు అన్నారు. దాడిని ఖండిస్తూ జాతీయ సమితి సభ్యులు కె.నాగరాజు, జి.కొండప్ప, ఏపీయూడబ్ల్యూజే గౌరవాధ్యక్షుడు సుబ్బయ్య, గౌరవ సలహాదారుడు కృష్ణారెడ్డి, అధ్యక్షుడు ఈఎన్ రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసగౌడు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజి, ఫొటో అండ్ వీడియో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు స్నేహాల్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు శివ, అవినాశ్, దస్తగిరి, వెంకటేశ్‌లు ఓ ప్రకటనలో ఖండించారు. రాజకీయ పార్టీల సభలు, సమావేశాల ఫొటోలు తీయడం.. వార్తలు సేకరించడం జర్నలిస్టులకు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. సీఎం జగన్ సభ ఫొటోలు తీసేందుకు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణను వైసీపీ రౌడీలు చుట్టుముట్టి విచక్షణారాహితంగా కొట్టారని అన్నారు. కాళ్లతో తన్నడం, పిడిగుద్దులు గుద్దడం చూస్తే చంపాలనే కుట్ర స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించే వారిపై రోజురోజుకూ దాడులు అధికమవుతున్నాయని, ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. రాచరిక పాలనలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోందన్నారు. ఈ దాడిని ఖండిస్తూ సోమవారం మండల కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాల్లో జర్నలిస్టులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అనంతపురం జిల్లా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం సాయంత్రం 4 గంటలకు నంద్యాలలోని శ్రీనివాస సెంటర్‌లో ఏపీయూడబ్ల్యూజే ధర్నా, నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. అదేవిధంగా కర్నూలు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీయూడబ్ల్యూజే నాయకులు వెల్లడించారు.



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దుర్మార్గం




అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభలో విధి నిర్వహణలో భాగంగా ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం దుర్మార్గం. సభలో సీఎం జగన్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వల్లే ఆ పార్టీ శ్రేణులు రెచ్చిపోయి శ్రీకృష్ణపై దాడులకు పాల్పడ్డారు. పత్రికా స్వేచ్ఛకు ఇది భంగం కలిగిస్తోంది. ఏ రాజకీయ పార్టీ సభలు సమావేశాలు పెట్టినా వృత్తిధర్మంలో భాగంగా జర్నలిస్టులు కవరేజికి వస్తారు. మీకు సరిపోకపోతే ఇలా దాడులు చేస్తారా? పత్రికా వ్యవస్థనే భయపెడితే సామాన్యులు మరింత భయపడుతారనే దురుద్దేశపూర్వకంగానే జగన్ మూక ఇలాంటి దాడులకు పాల్పడుతోందన్నారు. రెండు నెలల్లో జరిగే ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు వచ్చే ఓటర్లపై కూడా ఇలాంటి దాడులకు పాల్పడుతారా? అనే సందేహం కలుగుతోంది. జర్నలిస్టులపై దాడులు ఓ పథకం ప్రకారమే జరుగుతున్నట్లు అనిపిస్తోంది. శ్రీకృష్ణపై దాడులకు పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలి.

- బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు







శ్రీకృష్ణపై దాడి అమానుషం

అనంతపురంలో రాప్తాడులో సీఎం జగన్ ప్రసంగిస్తుండగానే అదే సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరి మూకలు దాడి చేయడం దారుణం. పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభంగా ఉన్న పత్రికా, మీడియా రంగం ఎక్కడికైనా వెళ్లి విధి నిర్వహణ చేసే అవకాశం ఉంది. రాజ్యాంగం మీడియాకు హక్కులు కల్పించింది. సీఎం సభలో ఫొటోలు తీస్తున్న వారిపై దాడి చేసి విచక్షణారహితంగా కొట్టడం వైసీపీ రౌడీయిజానికి నిదర్శనం. ఇలాంటి సంఘటనలను ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముప్ముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా పత్రికా స్వేచ్ఛను కాపాడేలా చట్టం తీసుకురావాలి.

- సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్



రౌడీ రాజ్యాన్ని తలపిస్తోంది

వైసీపీ నాయకులు విచ్చలవిడిగా చేస్తున్న దాడుల తీరును చూస్తుంటే.. జగన్ పాలన రౌడీరాజ్యాన్ని తలపిస్తోంది. అనంతపురంలో సీఎం జగన్ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ పెద్ద ఎత్తున సీఎం సిద్ధం సభ నిర్వహించారు. ఆ సభ వార్త కవరేజీ, ఫొటోల కోసం జర్నలిస్టులు వెళ్లడం వారి విధిలో భాగం. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు రౌడీల్లాగా దాడులు చేసి కాళ్లతో తన్ని గాయపరచడం అత్యంత దుర్మార్గం. ఇలాంటి చర్యలకు ఎవరూ పాల్పడినా కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉంది. కర్నూలులో ఎంపీ అవినాశ్ రెడ్డి అరెస్టు సమయంలో, ఇటీవల ఆస్పరిలో ఆంధ్రజ్యోతి విలేకరిపై దాడులు చేసింది కూడా వైసీపీ అరాచకశక్తులే. అమరావతిలో ఈనాడు ఫొటోగ్రాఫర్‌పై కూడా దాడులు చేశారు. వాస్తవాలను రాస్తే దాడులు చేస్తారా? ఇదేం న్యాయం. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి.

- గిడ్డయ్య, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

దాడులు దారుణం : ఏపీజేఎఫ్

సీఎం జగన్ మోహన్ రెడ్డి సిద్ధం సభను కవరేజ్ చేయడానికి వెళ్లిన అనంతపురం ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరి మూకలు దాడులు చేయడం దారుణమని ఏపీజేఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, ఎం.సాయి కుమార్‌లు అన్నారు. ఇలాంటి సంఘటనలను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. అభ్యంతరాలు ఉంటే సదరు ఫొటోగ్రాఫర్‌ను గౌరవంగా బయటకు పంపాలి కానీ, ఇలాంటి దాడులకు పాల్పడం దారుణమని దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వారిని అరెస్టు చేయకపోతే ఏపీజేఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దుర్మార్గం

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభలో విధి నిర్వహణలో భాగంగా ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఖండించారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సభలో సీఎం జగన్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వల్లే ఆ పార్టీ శ్రేణులు రెచ్చిపోయి శ్రీకృష్ణపై దాడులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. పత్రికా వ్యవస్థనే భయపెడితే.. సామాన్యులు మరింత భయపడుతారనే దురుద్దేశపూర్వకంగానే జగన్ ఇలాంటి దాడులకు ఉసిగొల్పుతున్నాడు. దాడుల కు పాల్పడే వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని బీసీ జనార్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.



ఎన్నికల సంగ్రామానికి జగన్ సిద్ధమంటుంటే ఆ పార్టీ నాయకులు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయం అనంతపురం జిల్లా రాప్తాడు సభతో తేటతెల్లమైంది. రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు జిల్లా నుంచి చాలా మంది నాయకులు డుమ్మా కొట్టారు. ఇందులో ప్రధానంగా మంత్రి గుమ్మనూరు జయరాం వర్గం ఉండగా అదే బాటలో పత్తికొండ, ఎమ్మిగనూరు, కోడుమూరు నాయకులు కూడా ఉన్నారు. దీనికి వైసీపీలో ఉన్న వర్గ విభేదాలే కారణమని తెలుస్తోంది. ఎమ్మెల్యేలను కాదని అధిష్ఠానం కొత్త వారికి నియోజకవర్గ బాధ్యతలను కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఎమ్మెల్యేలు, నియోజవకర్గ ఇన్‌చార్జిలు రెండు వర్గాలుగా విడిపోయారు. ఈ క్రమంలోనే సిద్ధం సభకు నియోజకవర్గ ఇన్‌చార్జిలను ఎమ్మెల్యేలు ఆహ్వానించలేదు. దీంతో వారంతా పిలవని పేరంటానికి ఎందుకు వెళ్లాలని సిద్ధం సభకు డుమ్మా కొట్టారు.



మేము సిద్ధంగా లేం..!

- పిలవని పేరంటానికి ఎలా వెళ్లాలి?
- రాప్తాడు సభకు వైసీపీ నాయకుల డుమ్మా
- మంత్రి గుమ్మనూరు జయరాం వర్గం దూరం
- అదే బాటలో మరికొందరు నాయకులు
- వైసీపీలో బయటపడిన వర్గపోరు

కర్నూలు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు మిగిలిన సమయం 50 రోజులే. ఎన్నికలకు వైసీపీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం జగన్ ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో సిద్ధం సభ నిర్వహించారు. అయితే తాము 'సిద్ధం'గా లేమంటూ వివిధ నియోజకవర్గాల్లో వైసీపీ ముఖ్య నాయకులు, వారి వర్గీయులు డుమ్మా కొట్టారు. చాలా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు గెలవలేరంటూ పక్కన పెట్టడడంతో ఆగ్రహంతో రగిలిపోతున్నారు. దీంతో వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. రాయలసీమలో ప్రతిష్ఠాత్మకంగా వైసీపీ నిర్వహించిన సిద్ధం సభకు ఆలూరు నియోజకవర్గానికి చెందిన మంత్రి జయరాం, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, ఎమ్మిగనూరుకు చెందిన ఏపీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై. రుద్రగౌడ్, పత్తికొండకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్ రెడ్డి వర్గాలు దూరంగా ఉన్నాయి.

సిద్ధం సభకు దూరంగా ఎమ్మెల్యే ఎర్రకోట వర్గీయులు

ఎమ్మిగనూరు నియోజకవర్గం వైసీపీలోనూ వర్గ విభేదాలు బయటపడ్డాయి. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి అత్యంత సన్నిహితులు కూడా సిద్ధం సభకు గైర్హాజరు కావడం గమనార్హం. వయోభారం వల్ల ఎమ్మెల్యే ఎర్రకోట తన కుమారుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని సీఎం జగన్‌ను అభ్యర్థించారు. అయితే ఎర్రకోట తనయుడు గెలవలేడని సీఎం జగన్ టికెట్ నిరాకరించిన సంగతి తెలిసిందే. ఇన్‌చార్జిగా మాజీ ఎంపీ బుట్టా రేణుక నియమించారు. మొదట్లో బుట్టా రేణుకను తీవ్రంగా వ్యతిరేకించిన ఎమ్మెల్యే ఎర్రకోట అధిష్ఠానం బుజ్జగించడంతో మెత్తపడ్డారు. నాలుగు దశాబ్దాలుగా ఎర్రకోటకు జై కొట్టిన ఆయన సన్నిహితులు ప్రస్తుతం బుట్టా రేణుకకు జై కొట్టడం ఎమ్మెల్యే ఎర్రకోట కుమారుడు, కుటుంబ సభ్యులకు మింగుడు పడడం లేదు. ఈ నేపథ్యంలోనే ఆదివారం రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు ఎమ్మెల్యే ఎర్రకోట అత్యంత సన్నిహితులు డుమ్మా కొట్టడం చర్చగా మారింది. ప్రధానంగా కోటేకల్లు, దేవిబెట్ట, మల్కాపురం, కడివెళ్ల, కందనాతి, కలుగొట్ల, దైవందిన్నె వంటి ప్రధాన గ్రామాల నుంచి ఎర్రకోట ముఖ్య అనుచరులు సహా పలువురు సర్పంచులు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. కనీసం వారికి పిలుపు కూడా లేదని సమాచారం. వైసీపీ ఇన్‌చార్జి బుట్టా రేణుక తన వర్గాన్ని బలోపేతం చేసుకోవడానికే ఉద్దేశపూర్వకంగానే ఎర్రకోట వర్గీయులను దూరంగా ఉంచారని సమాచారం. అయితే ఎర్రకోటకు బలమైన వర్గం ఉన్న గ్రామాలకు కనీసం బస్సులు కూడా పంపకపోతే ఎలా వెళ్తామని ఎమ్మెల్యే వర్గీయులు ఆక్రోశం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అలాగే.. ఏపీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డారు. ప్రస్తుతం ఆయన కూడా సైలెంట్‌గా ఉన్నారు. తనకు సహకరించాలని ఇటీవల బుట్టా రేణుక ఆయన ఇంటికి వెళ్లి అడిగితే సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. రుద్రగౌడ్ వర్గీయులు కూడా తాము సిద్ధంగా లేమంటూ రాప్తాడుకు డుమ్మా కొట్టడం కొసమెరుపు.



దెబ్బ కొట్టేందుకు తెర వెనుక ఎత్తులు

రాబోయే ఎన్నికల్లో విరుపాక్షిని రాజకీయంగా దెబ్బకొట్టేందుకు తెర వెనుక ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే వైసీపీ అధిష్ఠానం ప్రతిష్ఠాత్మంగా నిర్వహించిన రాప్తాడు సిద్ధం సభకు మంత్రి జయరాం సహా ఆయన సోదరులు, వర్గీయులు దూరంగా ఉండిపోయారు. రెండు రోజుల క్రితం కర్నూలులో జరిగిన ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మనవడు పవన్‌కళ్యాణ్‌రెడ్డి వివాహానికి హాజరైన సీఎం జగన్‌ను మంత్రి జయరాం కలిశారు. దీంతో ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారని ఆ పార్టీ నాయకులు చర్చించుకున్నారు. అయితే ఆదివారం రాప్తాడులో నిర్వహించి సభకు డుమ్మా కొట్టడంతో కథ మొదటికి వచ్చినట్టయింది. అంతేగాకుండా రాబోయే ఎన్నికల్లో తామేంటో చూపిస్తామంటూ జయరాం వర్గీయులు శపథం చేస్తున్నారంటూ రాజకీయంగా చర్చ జరుగుతోంది.







ఆలూరు నుంచి మంత్రి జయరాం వర్గం..



ఆలూరు నియోజకవర్గం నుంచి మంత్రి గుమ్మనూరు జయరాం, ఆయన వర్గీయులు రాప్తాడు సిద్ధం సభకు దూరంగా ఉన్నారు. ఈ ఘటనతో వైసీపీలో విభేదాలు ఉన్నట్టు మరోసారి స్పష్టమైంది. ఇదే నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలు పోటీ చేసిన మంత్రి జయరాం రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. జగన్ క్యాబినెట్‌లో స్థానం దక్కించుకున్నారు. అయితే రాబోయే ఎన్నికల్లో జయరాం గెలవలేరని సీఎం జగన్ పక్కన పెట్టారు. జయరామ్‌కు ఏ మాత్రం ఇష్టం లేని ఎంపీగా పోటీ చేయమని చెప్పడం మంత్రికి, ఆయన వర్గీయులకు ఏమాత్రం మింగుడు పడలేదు. అంతేకాదు.. పార్టీలో వైరి వర్గానికి చెందిన చిప్పగిరి జడ్పీటీసీ సభ్యుడు బి. విరుపాక్షిని నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జిగా నియమించడం అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారు.

పిలవని పేరంటానికి వెళ్లాలా..?:



పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైసీపీ సీనియర్ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి వర్గాల మధ్య ఉన్న విభేదాలు రాప్తాడు సభ రూపంలో మరోసారి బయటపడ్డాయి. పిలవని పేరంటానికి వెళ్లాలా అంటూ అధిష్ఠానంతోనే తేల్చుకుంటామని పోచిమిరెడ్డి వర్గం అన్నట్లు సమాచారం. పత్తికొండ వైసీపీ టికెట్ ఎమ్మెల్యే శ్రీదేవితోపాటు సీనియర్ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ దంపతులు ఆశిస్తున్న విషయం తెలిసిందే. దీంతో పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి వర్గాన్ని ఎమ్మెల్యే శ్రీదేవి పక్కన పెట్టారని ఆ పార్టీలో ప్రధానంగా చర్చ జరుగుతోంది. వైసీపీ ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన రాప్తాడు సభకు మురళీధర్‌రెడ్డి వర్గీయులకు ఎమ్మెల్యే శ్రీదేవి కనీస సమాచారం కూడా ఇవ్వలేదని, అలాంటప్పుడు ఎలా వెళ్తామని అంటున్నారు. కోడుమూరు నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ వర్గీయులు సిద్ధం సభకు డుమ్మా కొట్టారు. ఇన్‌చార్జిగా నియమించబడిన ఆదిమూలపు సతీష్‌ను ఎమ్మెల్యే వర్గీయులను కావాలనే దూరంగా ఉంచుతున్నారని ఆరోపిస్తున్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు నరకం

సర్వీసులన్నీ సిద్ధం సభకు మళ్లించడంతో అవస్థలు



కర్నూలు(రూరల్)ఫిబ్రవరి 18: కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం బస్సులు లేక ప్రయాణికులు నరకం చూశారు. దాదాపు 70 శాతానికి పైగా ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులన్నీ అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్‌రెడ్డి నిర్వహించే సిద్ధం సభకు తరలించడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది. ప్రత్యామ్నాయంగా బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో దూర ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఆర్టీసీ ఉన్నతాధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అరకొర బస్సులు వేళకు రాక ప్రయాణికులకు సరిపోక అష్టకష్టాలు పడ్డారు. కర్నూలు రీజియన్ వ్యాప్తంగా ప్రతిరోజూ 400 దాకా సర్వీసులు నడుస్తుండగా అందులో 220 పైగా బస్సులను ఆర్టీసీ అధికారులు జగన్‌రెడ్డి సభకు తరలించారు. ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, గూడూరు, బెళగల్, ఆలూరు వంటి ప్రాంతాల ప్రజలు బస్సుల కోసం కొత్తబస్టాండ్‌లో గంటల తరబడి నిరీక్షించారు. ఉదయం నుంచే బస్సుల కొరత ఏర్పడింది. రెండు మూడు గంటలకు ఒక బస్సు రావడంతో అందులో సీట్ల కోసం ఎగబడే పరిస్థితి ఏర్పడింది. మరికొంత మంది ప్రైవేట్ ఉద్యోగులు సొంత ఊళ్లకు వచ్చి తిరుగు ప్రయాణంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించడంతో అధిక చార్జీలు వసూలు చేశారు. జనం క్షేమాలను చూడాల్సిన ప్రభుత్వమే ప్రజలకు ఇంతటి ఇబ్బంది కలిగించడం దారుణమని పలువురు ప్రయాణికలు ప్రభుత్వంపై శాపనార్థాలు పెట్టారు.







ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 18: ఆటో బోల్తా పడి మృతి చెందిన ఘటన ఆదివారం జూపాడుబంగ్లా సమీపంలోని కేజీ రోడ్డుపై జరిగింది. పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన బాలవెంకటరమణగౌడు (54) ఆత్మకూరులో బంధువుల పెళ్లి ఉందని జూపాడుబంగ్లాకు వచ్చి అక్కడ ఆటో వెళుతుండగా జూపాడుబంగ్లా- 80 బన్నూరు గ్రామాల మధ్య మలుపులో స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ఉన్న బాలవెంకటరమణ గౌడుకు తీవ్ర గాయాలు, ఆటోడ్రైవర్ హమీద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఏఎస్ఐ మేరీ జయంతి తెలిపారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు, భార్య ఉన్నట్లు చెప్పారు. మృతుడి భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఓర్వకల్లు, ఫిబ్రవరి 18: ఓర్వకల్లు గ్రామానికి చెందిన కంబలి నాగేశ్వరయ్య (50) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. కంబలి నాగేశ్వరయ్య భార్య ఇటీవలె మృతి చెందింది. దీనికితోడు ఆయనకు వ్యవసాయంలో అప్పులయ్యాయి. వీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. మృతుని కుమార్తె భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు ఐఐఐటీడీఎం జాతికి అంకితం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 18: కర్నూలు జగన్నాథగట్టుపై ఏర్పాటు చేసిన ఐఐఐటీడీఎంను మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం 151.51 ఎకరాల్లో రూ.296.12 కోట్లతో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో నిర్మించారు. ఈ క్యాంపస్‌లో 16 తరగతి గదులు, 22 ప్రయోగశాలలు, లైబ్రరీ, కంప్యూటర్ సెంటర్, 3 సెమినార్ హాళ్లు, 4 హాస్టళ్లు, 2 మెస్ బ్లాకులు, డైరెక్టర్ బంగ్లా, 20 ఫ్యాకల్టీ క్వార్టర్లు నిర్మించారు. అలాగే 2 సబ్‌స్టేషన్లు, హెల్త్ అండ్‌వెల్‌నెస్ సెంటర్లతో పాటు 1260 మంది విద్యార్థులకు వసతి కల్పించేందుకు అభివృద్ధి చేశారు. ఈ క్యాంపస్‌లో మొత్తం 907 మంది విద్యార్థులు 4 అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలు, 6 పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలు, పీహెచ్‌డీ ప్రోగ్రాంలలో విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరం 40 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీ, 10 మంది అనుబంధ ఫ్యాకల్టీ, ప్రొఫెసర్ ప్రాక్టీస్ 19మంది రెగ్యులర్ నాన్ టీచింగ్ సిబ్బందితోపాటు ఔట్‌సోర్సింగ్, సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తున్నారు. రూ.843.56 లక్షల విలువైన పరిశోధన ప్రాజెక్టులను అమలు చేస్తున్నారు. దీంతోపాటు 14 పేటెంట్లు ఇన్‌స్టిట్యూట్‌కు మంజూరయ్యాయి. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, చైర్మన్ హెచ్‌ఏ ప్రొ.రంగనాథ్, డైరెక్టర్ ప్రొ.డీవీఎల్ఎన్ సోమయాజులు, రిజిస్ట్రార్ గురుమూర్తిలతో పాటు ఫ్యాకల్టీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొననున్నారు

21న జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 18: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 21న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఇన్‌చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డితో పాటు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, శాసనసభ్యులు, ఎంపీలు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా పరిషత్ అండ్ మండల ప్రజాపరిషత్‌ల వార్షిక బడ్జెట్‌పై చర్చ ఉంటుందన్నారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

1600 లీటర్ల ఊట, 35 లీటర్ల సారా ధ్వంసం



నాటు సారా స్థావరాలను ధ్వంసం చేస్తున్న సెబ్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 18: నగరంలోని బంగారుపేటలో ఉన్న నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఆదివారం అడిషనల్ ఎస్పీ రవికుమార్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐలు కేఆర్ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నాటు సారా తయారు చేయడానికి సిద్ధంగా ఉంచిన 1600 లీటర్ల ఊట, 35 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. మరో ప్రదేశంలో నాటు సారా విక్రయిస్తున్న షికారి మధు నుంచి 30 లీటర్ల నాటు సారా, షికారి లక్ష్మి నుంచి 25 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి బాధ్యులను రిమాండ్‌కు పంపామని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ జీ. మారుతీ ప్రసాద్, డీటీఎఫ్ ఎస్ఐ వీరస్వామి, ఇంటలిజెన్స్ ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

భావితరాలకు ఆధ్యాత్మిక వారసత్వాన్ని అందించాలి

కలెక్టర్ డాక్టర్ జి. సృజన



ధార్మిక సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 18: ఆధ్యాత్మిక సంపదను భావి తరాలకు అందించాలని కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. ఆదివారం రాత్రి నగరంలో రాఘవేంద్రనగర్‌లోని షిరిడీ సాయిబాబా ధ్యాన మందిరంలో, కర్నూలు స్పిరిచ్యువల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, పిరమిడ్ బ్రహ్మరుషి డాక్టర్ బీవీ రెడ్డి ఏర్పాటు చేసిన బాబా విగ్రహమూర్తికి వెండి మకర తోరణం, వెండి సింహాసనం అలంకరణ ఉత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాబా విగ్రహానికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ధ్యాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పిరమిడ్ ధ్యాన కేంద్రాలు ఆధ్యాత్మిక స్ఫూర్తికి జీవం పోస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, విశ్రాంత ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మాలకొండయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తదితరులు ప్రసంగించారు.

రైతులు సహకరించాలి

రుణ బకాయిలు చెల్లించి సహకార బ్యాంకుకు తోడ్పడండి

- కేడీసీసీ బ్యాంకు సీఈవో శివలీల

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 18: ఉమ్మడి కర్నూలు జిల్లాలో సహకార కేంద్ర బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్న రైతులు వెంటనే నిర్దేశించిన సమయంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి పాటుపడాలని ఆ బ్యాంకు సీఈవో శివలీల విజ్ఞప్తి చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రుణాల రికవరీకి లక్ష్యం మేరకు రికవరీ చేసేందుకు అధికారుల బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పాత బకాయిలు దాదాపు రూ.200 కోట్లు ఉండగా.. రూ.20 కోట్లు రెన్యువల్ అయ్యాయని, మిగిలిన రూ.180 కోట్లను వసూలు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు అన్ని రుణాలు కలిపి రూ.756 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. దీనికి రైతులు సహకరించాలని కోరారు. ఈ మేరకు బ్యాంకు అధికారులు, సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తారని అన్నారు. గడువులోగా రుణాలు చెల్లిస్తే.. అధికవడ్డీతో పాటు అపరాధ వడ్డీ భారం ఉండదని అన్నారు.

శాస్త్రబద్ధంగా మహా కుంభాభిషేకం



మహాకుంభిషేకం క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, ఫిబ్రవరి 18: శ్రీశైలం క్షేత్రంలో మహాకుంభాభిషేకం వేడుకలను దేవస్థానం వైభవంగా నిర్వహిస్తోంది. రాష్ట్ర కల్యాణం, ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన మహా కుంభాభిషేకం మహోత్సవ క్రతువులు మూడో రోజు కొనసాగాయి. ఉదయం సకలదోషాలను హరింపజేసే గోపూజ, మండప పూజలు, జపాలు, వేదపారాయణలు, గణపతి, రుద్ర, చండీ పారాయణలు, హోమాలు, వేదహవనాలు శాస్త్రబద్ధంగా నిర్వహించారు. సాయంత్రం ధాన్యాధివాసం, దేవతా హవనాలు, వేదహవనాలు, వేదస్వస్తి, నీరాజన మంత్ర పుష్పం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ నెల 16న ప్రారంభమైన మహా కుంభాభిషేకం మహోత్సవం 21వ తేదీతో ముగియనుంది. ఆరు రోజులపాటు జరిగే మహోత్సవంలో చివరి రోజు 21వ తేదీన ఆల యంలో పునర్నిర్మించిన శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్ఠ, ఆలయ ప్రాంగణంలో పునరుద్ధరించిన కొన్ని ఉప ఆలయాలు, పంచ మఠాలలోని మూడు మఠాలలో శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠలను శాస్త్రానుసారంగా చేయనున్నారు. ఉత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో విధివిధానంగా కలశాలను నెలకొల్పి, ఆయా కలశాలలో దేవతాశక్తిని నిక్షిప్తం చేసి, జప, పారాయణ, ధ్యాన, హోమాదులను జరిపిస్తున్నారు. చివరగా మంత్ర పూజిత జలాలతో ఆలయంలోని గర్భాలయ విమానాలు, గోపురాలు, దేవతామూర్తులను అభిషేకిస్తారు. శ్రీశైలంలో నిర్వహించే ఈ మహిమాన్విత కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు.

పార్టీ పరిధిలోనే పని చేయాలి

- క్రమ శిక్షణ చర్యలు తప్పవు
- మాచాని సోమనాథ్‌ను సంజాయిషీ కోరాం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 18: ప్రతి ఒక్కరూ పార్టీ పరిధిలోనే పని చేయాలని.. లేదంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని ఎమ్మెల్సీ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బీటీ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రాకుండా ఉండేందుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోని వారిని రెచ్చగొట్టి గ్రూపులుగా విడదీసి లబ్ధి పొంది తిరిగి అధికారంలోకి రావటానికి కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఇటీవల ఎమ్మిగనూరులో డా. మాచాని సోమనాథ్ నియోజకవర్గంలో పర్యటిస్తుండగా ఫ్లెక్సీలలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు, నియోజకవర్గం ఇన్‌చార్జి బీవీ జయనాగేశ్వరరెడ్డి ఫొటోలను ముద్రించకపోవడం రాష్ట్ర, జిల్లా పార్టీ దృష్టికి వచ్చిందని అన్నారు. సోమనాథ్ ఈ విధంగా చేయడం పార్టీ క్రమశిక్షణా రాహిత్యం కిందకు వస్తుందని అన్నారు. ఈ విషయంపై మాచాని సోమనాథ్‌ను సంజాయిషీ కోరామని తెలిపారు.

వైభవంగా సూర్యనారాయణ స్వామి కళ్యాణం



వైభవంగా ఛాయా, ఉషాదేవి సమేత సూర్యనారాయణస్వామి కళ్యాణోత్సవం

కల్లూరు, ఫిబ్రవరి 18: ఛాయా, ఉషా సమేత సూర్యనారాయణ స్వామి కళ్యాణోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గుత్తిపెట్రోల్ బంక్ సమీపంలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో గణపతి సచిదానంద స్వామీజీ ఆశీస్సులతో ఆలయ ధర్మకర్తల మండలి, ట్రస్టీ టి.శివరామకృష్ణ ఆధ్వర్యంలో కళ్యాణోత్సవం ఘనంగా జరిపారు. ప్రధాన సేవకులు జి, విజయభాస్కరరెడ్డి కళావతి, వై.రామ్మోహన్ అనంతలక్ష్మి, సి.కృష్ణారెడ్డి మంజుల దంపతులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 64 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్),ఫిబ్రవరి 18: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలకు ఆదివారం 64 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లాలో మొత్తం 3353 మందికి గాను 3289 మంది హాజరయ్యారని, ఉదయం సెషన్స్‌లో 1757 మందికి గాను 1723 మంది హాజరయ్యారని అన్నారు. అలాగే మధ్యాహ్నం జరిగిన సెషన్స్‌లో 1596 మందికి గాను 1566 మంది హాజరయ్యారని ఆర్ఐవో తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను డీఈసీ కమిటీ సభ్యులు ఆర్ఐవో, డీవీఈవో, స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించినట్లు తెలిపారు.

వైసీపీ నాయకుడి దౌర్జన్యం

- పక్క పొలం ఆక్రమణ
- రాత్రికి రాత్రే రహదారి



బాధిత రైతు పురుషోత్తం రెడ్డి పొలంలో రహదారి

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 18: నంద్యాల మండలంలోని రాయమల్పురం గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ కుమారుడు పూల శ్రీను దౌర్జన్యానికి దిగాడు. టీడీపీ నేత పొలాన్ని ఆక్రమించి రాత్రికి రాత్రే రహదారి వేయించుకున్నాడు.. రాయమల్పురం గ్రామ పరిధిలోని సర్వే నెం. 30లో వైసీపీ నాయకుడు పూల శ్రీనుకు 1.30 ఎకరాల పొలం ఉంది. పొలం పరిసరాల్లోనే పక్క గ్రామమైన పులిమద్దికి చెందిన పురుషోత్తం రెడ్డికి సర్వే నెం. 27/1లో 43 సెంట్లు 27/2లో 23 సెంట్ల పొలం ఉంది. వైసీపీ నాయకుడి పొలానికి రహదారి లేకపోవటంతో పురుషోత్తం రెడ్డి పొలాన్ని ఆక్రమించాడు. రాత్రికి రాత్రే పురుషోత్తం రెడ్డి చెందిన సర్వే నెంబర్ 27/1 పొలంలో మట్టి రాళ్లు తోలి రహదారి వేశాడు. విషయం తెలుసుకున్న పురుషోత్తం రెడ్డి పూల శ్రీను అధికారానికి జడిసి రెవెన్యూ సిబ్బందిని ఆశ్రయించాడు. సబంధింత వీఆర్వో అశోక్ ఘటనా స్థలికి చేరుకుని పూలశ్రీను దౌర్జన్యంగా రస్తా వేసుకున్న విషయాన్ని నిర్ధారించుకున్నారు. విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పి వెళ్లాడు. దీంతో తనకు న్యాయం చేయాలని పురుషోత్తం రెడ్డి వేడుకుంటున్నాడు.

మహా కుంభాభిషేకం ఏర్పాట్లపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ

శ్రీశైలం, ఫిబ్రవరి 18: శ్రీశైలం క్షేత్రంలో నిర్వహిస్తున్న మహా కుంభాభిషేకం, శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆదివారం రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన జరిగే మహాకుంభాభిషేక మహోత్సవంలో స్వామి, అమ్మవార్లకు నిర్వహించే కైంకర్యాలు, వైదిక కార్యక్రమాలు సమయపాలనతో పరిపూర్ణంగా జరిపించాలన్నారు. కుంభాభిషేకం మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని సంప్రదాయ బద్ధంగా అలంకరించాలని సూచించారు. అన్ని విభాగాల అధిపతులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలిస్తూ ఎటువంటి లోపాలు లేకుండా కుంభాభిషేక మహోత్సవాన్ని జరిపించాలన్నారు. ఆలయ వేళలు మొదలైన సమాచారాన్ని ఆలయ ప్రసార వ్యవస్థ ద్వారా భక్తులకు తెలియజేయాలన్నారు. అలాగే శ్రీశైల టీవీ ద్వారా మహాకుంభాభిషేక మహోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాలని చెప్పారు. అనంతరం మార్చి 1 నుంచి 11 వరకు జరగబోయే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు దేవస్థానం చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. శివదీక్షా భక్తుల జ్యోతిర్ముడి సమర్పణ ఏర్పాట్లు, ఆరుబయట ప్రదేశాలలో విద్యుద్దీకరణ, తాత్కాలిక శౌచాలయాలు, క్షేత్ర పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, సూచికబోర్డు ఏర్పాటు, పాతాళగంగలో జల్లు స్నానాల ఏర్పాట్లు, నీటి సరఫరా, పారిశుధ్యం తదితర ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమీక్షలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, దేవస్థానం వైదిక కమిటీ సభ్యులు, స్వామివారి ప్రధానార్చకులు శివప్రసాద్, అమ్మవారి ప్రధానార్చకులు మార్కండేయశాస్త్రి, వేదపండితులు గంటి రాధాకృష్ణ శర్మ, అధ్యాపక పూర్ణానందరం, స్థానిక తహసీల్దార్ సి.గురప్ప, సీఐ ప్రసాదరావు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రక్త స్రావంతో మహిళ మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 18: కర్నూలు కొత్త బస్టాండు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి శస్త్రచికిత్స కోసం వచ్చిన ఓ మహిళకు తీవ్ర రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమించి హైదరాబాదుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. దీనికి కర్నూలులోని ప్రైవేట్ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆదివారం ఆందోళనకు దిగారు. నందికొట్కూరుకు చెందిన షేక్ ఆసియా (36)ను గర్భసంచి ఆపరేషన్ కోసం ఈ నెల 14వ తేదీ నగరంలోని కొత్తబస్టాండు వద్దనున్న ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్చారు. 15వ తేదీ వైద్యులు ఆపరేషన్ కోసం రోగిని థియేటర్‌లోనికి తీసుకెళ్లారు. ఉన్నట్టుండి రోగి ఆరోగ్య పరిస్థితి విషమించింది. మత్తుమందు ఇవ్వడంలో పొరపాటు, వైద్యుల అనుభవరాహిత్యం కలిసి రోగికి తీవ్ర రక్తస్రావం జరిగింది. రోగిని ఐసీయూలో ఉంచి రాత్రంతా చికిత్స అందించారు. అయినా పరిస్థితి విషమంగా మారడంతో 16వ తేదీ నగరంలోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ కూడా వైద్యులు చేతులెత్తేయడంతో హైదరాబాదుకు తరలించారు. అక్కడ ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 17వ తేదీ రోగి మృతి చెందింది. దీనికి కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు హాస్పిటల్ యాజమాన్యంతో వాగ్వివాదం చేశారు. పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేసి వివాదాన్ని సర్దుబాటు చేశారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 18: కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన బోయ నారాయణ (71) ఈ నెల 11వ తేదీ ఆత్మహత్యాయత్నం చేసి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. క్షయ వ్యాధితో బాధపడుతున్న నారాయణకు భార్యా పిల్లలు లేరు. జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోడానికి విష ద్రావణం తాగాడు. బంధువులు తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడని సీఐ గోపీనాథ్ రెడ్డి తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వినూత్న ఆలోచనలతోనే నూతన ఆవిష్కరణలు

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న యువత

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 18: యువత వినూత్నంగా ఆలోచించినప్పుడే నూతన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం రాత్రి నగర శివారులోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో 'లెవ్ యుగ్' అనే నూతన సంస్థకు సంబంధించిన లోగోను, వెబ్‌సైట్‌ను లక్ష్మీనారాయణ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లా, ప్రొద్దుటూరుకు చెందిన యువకుడు, ప్రస్తుతం కేరళలోని కాలికట్ ఎన్ఐటీలో తృతీయ సంవత్సరం బీటెక్ చదువుతున్న జీవి కైలాస్‌నాథ్ ఈ సంస్థను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. 19 ఏళ్ల ప్రాయంలోనే ఒక కంపెనీని ప్రారంభించిన కైలాస్‌నాథ్ యువతకు ఆదర్శమని ప్రశంసించారు. కైలాస్‌నాథ్ మాట్లాడుతూ యువత ఏదైనా కంపెనీ ప్రారంభించాలనుకుంటే మౌలిక సదుపాయాలు సమకూర్చడం తమ సంస్థ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్ బాషా, కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, ప్రముఖ రక్తదాత ఎల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం


కరాటేలో ప్రతిభ చాటిన వి.రేవతిని సన్మానిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

కల్లూరు, ఫిబ్రవరి 18: కరాటేలో ప్రతిభ చాటిన నగరానికి చెందిన సుబ్బరాయుడు లక్ష్మీదేవి దంపతుల కుమార్తె రేవతిని జిల్లా వడ్డెర సంఘం నాయకులు మక్కల్ల శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. విశాఖపట్టణంలో నిర్వహించిన కరాటే పోటీల్లో జిల్లా క్రీడాకారి ప్రతిభ చూపి ఆరెంజ్‌బెల్ట్ సాధించడంతో ఆదివారం జిల్లా వడ్డెర సంఘం కార్యాలయంలో సంఘం నాయకులు అభినందించారు. కార్యక్రమంలో మల్లయ్య, డి.పుల్లయ్య, విడ్డె.శ్రీనివాసులు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'మధ్వ నవమి'


మధ్వాచార్యులకు పూజలు చేస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 18: నగరంలో సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో కొనసాగుతున్న శ్రీదేవీ భూదేవీ సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తొమ్మిదో రోజున మధ్వ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి, అమ్మవార్ల మూల మూర్తులకు, ఉత్సవ మూర్తులకు, మధ్వాచార్యులకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం మహా మృత్యుంజయ హోమం, ధన్వంతరీ హోమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాలకు చెందిన మాస్టర్ కిరణ్ బృందంతో సంగీత కచేరీ ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరింపజేసి, హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కళ్లే చంద్రశేఖర శర్మ, హెచ్‌కే రాజశేఖర్, గౌరవ సలహాదారు హెచ్‌కే మనోహర్‌రావు, సభ్యులు కేజీ ప్రభాకర్, ఉమేష్, కేవీ సుబ్బారావు, రామమనోహర్, కేవీ విజయభాస్కర్, బాలసత్యనారాయణ, దుర్గాప్రసాద్, శ్రీనాథ్, వాయుసేన, మహిళా సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్ గ్రేడ్‌ల ప్రదానం


పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేజీ గంగాధరరెడ్డి

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 18: తైక్వాండో క్రీడలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బెల్ట్ గ్రేడ్‌లను ప్రదానం చేశారు. ఆదివారం పాతనగరంలోని యునైటెడ్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కేజీ గంగాధరరెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు హాజరై బెల్టులను అందజేసి, అనంతరం క్రీడా పోటీల ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ తైక్వాండో ఒలంపిక్ క్రీడ అని, ఈ క్రీడల్లో రాణించే క్రీడాకారులకు విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి టి. వెంకటేశ్వర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు, సాహితీవేత్తలు, కళాకారులు

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 18: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో, అశ్లీలతా ప్రతిఘటన వేదిక ప్రచురించిన ఈదర గోపీచంద్ సంపాదకత్వంలో వచ్చిన 'కామోత్సవ దహనం', 'విషపు తేలు' పుస్తకాలు జేవీవీ నాయకులు, సాహితీవేత్తలు ఆవిష్కరించారు. ఆదివారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోగల జేవీవీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జేవీవీ జాతీయ కార్యదర్శి మహ్మద్ మియా, సభ్యుడు కే శేషాద్రిరెడ్డి, సాహితీ వేత్తలు కేసీ కల్కూర, జేఎస్ఆర్‌కే శర్మ, డాక్టర్ ఎం హరికిషన్, గుర్రపుశాల అంకయ్య, ప్రొఫెసర్ శివశంకర్, కే మోహన్, హైదర్, గద్వాల సోమన్న, కే రామలక్ష్మయ్య, పుస్తకాల రచయిత ఈదర గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ ముప్పయ్ ఆరేళ్ల నాటి అశ్లీల చిత్రాలు, సీరియళ్లు, తిరునాళ్లలోని నృత్యాలు, టీవీ ప్రోగ్రామ్‌లపై అవిశ్రాంతంగా అనేక ప్రజా సంఘాలు పోరాటం చేశాయని, ఆ ఆధునిక సంఘ సంస్కరణోద్యమాలను, విజయగాథలను పుస్తకాల రూపంలో తీసుకురావడం అభినందనీయమని అన్నారు.

'ఘంటసాల పేరుతో అవార్డులు అందజేయాలి'



టీజీవీ కళాక్షేత్రంలో ఘంటసాల వర్ధంతి కార్యక్రమంలో పాటలు పాడుతున్న గాయకులు

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 18: సుప్రసిద్ధ తెలుగు చలన చిత్ర నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరావు పేరిట ప్రభుత్వం అవార్డులు అందజేయాలని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఘంటసాల 50వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఘంటసాల చిత్ర పటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించి, రెండు నిముషాలు శ్రద్ధాంజలి ఘటించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాక్షేత్రం అధ్యక్షుడు, నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళారంగానికి విశేషంగా సేవలు చేసి, దివంగతులైన వారి పేరుతో స్మారక అవార్డులు నెలకొల్పి ప్రోత్సాహికులకు అందజేయాలని కోరారు. ఘంటసాల గాత్రం అజరామరమని, అటువంటి మహా గాయకుడిని ఎల్లవేళలా గుర్తుంచుకోవాలని కోరారు. ఆయన స్ఫూర్తితో ఇప్పటి తరం గాయకులు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో గాయకులు, కళాకారులు మహ్మద్ మియా, గాండ్ల లక్ష్మన్న, సంఘా ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అలనాటి ఘంటసాల పాటలతో గాయకులు ఖాదర్ బాషా, హబీబ్, కడప రాధిక ప్రేక్షకులను అలరింపజేశారు. గాయకులకు శ్రీనివాసులు, రమణయ్య బృందం వాయిద్య సహకారం అందజేశారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

● గౌరు చరిత, మల్లెల రాజశేఖర్


హుశేనాపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న గౌరు చరిత, మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 18: వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరితరెడ్డి, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ తెలిపారు. ఆదివారం మండలంలోని హుశేనాపురం గ్రామంలోని గడివేముల బస్టాండు, వడ్డెపేట, బోయపేట కాలనీల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు వీరికి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలకు వీరికి ఘనంగ స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ కరపత్రాలు పంపిణీ చేస్తూ వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే.. రాష్ట్రంలో ప్రజా సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. అలాగే వైసీపీ అరాచకాలు ఎక్కువయ్యాయని ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజలందరూ తమ అమూల్యమైన ఓటుతో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. అలాగే చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అన్ని కులాల వారికి మేలు జరిగిందన్నారు. సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ తోఫా వంటి పథకాలతో వారి కుటుంబాల్లో ఆనందంగా పండుగ జరుపుకునే విధంగా పరిపాలన చేశారన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశ పెట్టిందని, దీని ద్వారా రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నంద్యాల పార్లమెంటు టీడీపీ మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, కాపు సంఘం యువనాయకుడు కేవీ మధు, నాయకులు వడ్డె నారాయణ, జయకృష్ణ, కాటినేని నారాయణ, బజారు, పరమటూరి గోపాల్, వేణు, సుధాకర్, రామగోవిందు, కర్నూలు శ్రీనివాసులు, వడ్డె రవి, గువ్వ రవికుమార్, రాము, అన్వర్ బాషా, దేవరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా టీడీపీ: టీజీ


టీడీపీలో చేరుతున్న మహేష్ బాబు ఫ్యాన్స్‌తో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 18: ముస్లింలకు టీడీపీ అండగా ఉంటుందని కర్నూలు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని 48 వ వార్డు పరిధిలోని ప్రకాష్‌నగర్, రోజా ప్రాంతాల్లో టీజీ భరత్ భరోసా యాత్ర అనే కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికి వెళి ముస్లింలను, మహిళలను, యువతను కలిసి మాట్లాడారు. ఈ ఐదేళ్లలో ముస్లింలు ఎంతో నష్టపోయారని చెప్పారు. ముస్లింలందరు ఓటు వేసి గెలిపించిన నాయకులు ముస్లింలకు ఏమి చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే ముస్లింలకు అండగా ఉండి అన్ని సంక్షేమ పథకాలు అందజేసి అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముస్లింలకు ఎంతో ఉపయోగపడే దుల్హన్ పథకానికి ఈ ప్రభుత్వం నిబంధనలు పెట్టడం వల్ల అర్హులకు అందకుండా పోయిందన్నారు. అంతే కాకుండా ప్రతి ఒక్క ముస్లిం సోదరుడు రంజాన్ పండును సంతోషంగా జరుకునేలా చంద్రన్న రంజాన్ తోఫా కానుకను మళ్లీ అందిస్తామని తెలిపారు. ముస్లింలందరు ఏకమై ఈ ప్రభుత్వాన్ని ఓడించాలన్నారు. టీజీ భరత్ కు స్థానికులు సమస్యలు చెప్పుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్నింటిని క్రమ పద్ధతిలో పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్సూర్, అలీఖాన్, దేవా, ముంతాజ్, శ్యామ్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మహేష్ బాబు ఫ్యాన్స్

సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ బాబు అభిమానులు తెలుగుదేశం పార్టీలో చేరారు. నగరంలోని మౌర్యఇన్‌లో నగరంలోని అభిమాన సంఘం నాయకులు కర్నూలు టీడీపీ ఇన్‌చార్జీ టీజీ భరత్‌కు మద్దతు ప్రకటిస్తూ తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. టీజీ భరత్ మాట్లాడుతూ మహేష్ బాబు అభిమానులు తనకు మద్దతు ఇవ్వడం సంతోషకరమన్నారు. సూపర్‌స్టార్ క్రిష్ణ, మహేష్ బాబు అభిమానులకు తాను అండగా ఉంటానని, స్టార్ హీరోల సినిమా విడుదల సమయంలో రాజకీయాలు చేస్తున్నారని, టికెట్ల విషయాన్ని పూర్తిగా ఫ్యాన్స్‌కే వదిలేయాలన్నారు. రాజకీయాలు చేయడం వల్ల అభిమానులు కొట్టుకునే పరిస్థితులు వచ్చాయన్నారు. ఇక కర్నూల్లో యువతకు ఉద్యోగాలు ఎంతో అవసరమన్నారు. టీడీపీని గెలిపిస్తే కర్నూలుకు పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. యువత అందిరిలో చైతన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అభిమానులు ఆహ్మద్, సురేష్ రవికుమార్, సమీర్, మధు, సలీం, రెడ్డి, జావీద్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న టీజీ భరత్

లలితా పీఠంలో టీజీ భరత్ పూజలు

కర్నూలు (కల్చరల్): పాతనగరంలో జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో కొనసాగుతున్న రాజశ్యామలా దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం జరిగిన పూజా కార్యక్రమాల్లో కర్నూలు నియోజిక వర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి టీజీ భరత్ హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి హోమము వద్ద జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి ఆధ్వర్యంలో, తెలహాకుల జ్ఞానేశ్వరమ్మ నిర్వహణలో నవరాత్రి పూజలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు చల్లా దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు చలో కలెక్టరేట్


మాట్లాడుతున్న వెంగళ్ రెడ్డి

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 18: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏపీ జేఏసీ చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాలులో ఏపీ జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ జేఏసీ జిల్లా ఛైర్మన్ ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని పలుమార్లు వైసీపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. ప్రభుత్వం పట్టించుకోకుండా ఉద్యోగులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వైసీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు అటెండర్ స్థాయి నుంచి గెజిటెడ్ ఉద్యోగి స్థాయి వరకు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెండింగ్‌లో బకాయిలు పెట్టిందని తెలిపారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు అడుగుతున్నామే తప్ప గొంతెమ్మ కోర్కెలు అడగడం లేదన్నారు. ఉద్యోగులకు లక్షల్లో బకాయిలు చెల్లించకపోవడం రాష్ట్ర చరిత్రలో వైసీపీ ప్రభుత్వానికి చెల్లుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లు భారీ ఎత్తున హాజరై చలో కలెక్టరేట్ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ జవహర్, నగర ఛైర్మన్ కాశన్న, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగ అధ్యక్షులు మద్దిలేటి, ఆర్టీసీ నేసనల్ మద్దూరు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్, మెడికల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

భారత్ రైస్ ఇచ్చేదెప్పుడో..?



కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 18: కేంద్ర ప్రభుత్వం భారత్ రైస్ పేరుతో నాణ్యమైన బియ్యాన్ని సబ్సిడీపై అందించేందుకు చర్యలు చేపట్టింది. కిలో రూ.29కే అందిస్తామని పది రోజులుగా ప్రభుత్వ వర్గాలు చెబుతుండటంతో ఎప్పుడెప్పుడు ఈ బియ్యాన్ని ఏ సంస్థ ద్వారా అందిస్తారోనని పేద ప్రజలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. సబ్సిడీతో ఇస్తుండడంతో ఈ బియ్యానికి బాగా డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నాఫెడ్ తదితర కేంద్ర సంస్థల ద్వారా సన్న బియ్యాన్ని చౌక ధరకు అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మార్క్‌ఫెడ్‌తోపాటు డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా ఈ బియ్యాన్ని అందించేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని కర్నూలు జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు తెలిపారు. ప్రస్తుతం బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఏడాది కాలంలో దాదాపు 15 శాతం బియ్యం రేట్లు పెరిగాయి. గతంలో నాణ్యమైన బియ్యం కిలో రూ.20 నుంచి రూ.30కే లభించేవి. క్రమక్రమంగా రైతులు నాణ్యమైన సన్నరకం బియ్యానికి సంబంధించిన ధాన్యాన్ని పండించేందుకు అనాసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాన కాల్వల కింద దాదాపు లక్ష హెక్టార్లలో వరి పంట సాగయ్యేది. గత కొన్ని సంవత్సరాల నుంచి సన్న బియ్యానికి సంబంధించిన వరి పంట సాగుకు రైతులు దూరమవుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో వరి పంటను సాగు చేయలంటే గతంలో రూ.30 వేలు ఖర్చు కాగా.. ప్రస్తుతం రూ.60 నుంచి 70 వేలకు పెరిగింది. చీడపీడలు ఎక్కువ కావడంతో పాటు వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వరి పంట సాగుకు రైతులు దూరమవాల్సిన పరిస్థితి దాపురించింది. దీంతో సన్నరకం బియ్యానికి విపరీతమైన కొరత ఏర్పడి డిమాండ్ పెరిగింది. రెండు రోజుల క్రితం కర్ణాటకలోని పోలార్‌లో రెండు గంటల్లోనే పది టన్నుల బియ్యం అమ్ముడు పోవడంతో ఈ బియ్యానికి ఎంత డిమాండు ఉందోనన్న విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఈ బియ్యాన్ని దక్కించుకునేందుకు ప్రజలు బైకులు, కార్లలో వచ్చి 5, 10 కిలోల బస్తాలను కొనుగోలు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), అదేవిధంగా నేషనల్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంస్థల ద్వారా కేంద్రం నాణ్యమైన సన్న రకం బియ్యాన్ని పేదలకు అందించేందుకు చర్యలు చేపట్టింది. త్వరలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూడా డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా నాణ్యమైన బియ్యాన్ని చౌక ధరకే అందించేం దుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయని, ప్రస్తుతం గోధుమపిండి, శనగ పప్పును అందించే కార్యక్రమాన్ని చేపట్టారని మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు తెలిపారు.

సీపీఐ నాయకుడి మృతికి సంతాపం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 18: సీపీఐ పార్టీ నగర శాఖ సభ్యుడు బజారన్న అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతికి సీపీఐ పార్టీ కర్నూలు నగర సమితి సంతాపాన్ని వ్యక్తం చేశారు. సీపీఐ సీనియర్ నాయకులు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శి సి.మహేష్, నగర కార్యవర్గ సభ్యులు ఎం.బీసన్న, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, మాజీ కార్పొరేటర్ గిడ్డమ్మ మృతుడు బజారన్న పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న కె.రామకృష్ణ

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 18: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో రెండు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ టికెట్‌ను తమ సామాజిక వర్గానికి కేటాయించాలని కురువ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రామకృష్ణ వివిధ రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. ఆదివారం బీసీ భవన్‌లో కురువ యువజన సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో కురువ సామాజిక ఓట్లు అత్యధికంగా ఉన్నాయని అన్నారు. రాజకీయ పార్టీలు కురువ సామాజిక వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కురువ సామాజికవర్గానికి ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు ఇవ్వని పక్షంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్రాముడు, వెంకటేశ్, సురేష్, రంగన్న, రమేష్ పాల్గొన్నారు.



నగరంలో నరకం

అడ్డదిడ్డంగా ఆటోల నిలిపివేత
ఆక్రమణకు గురవుతున్న రోడ్లు
ఇబ్బందుల్లో వాహనదారులు

కర్నూలు, ఫిబ్రవరి 18: నగరంలోని కొత్త బస్టాండ్, బళ్లారి చౌరస్తా, ప్రభుత్వ ఆసుపత్రి, జిల్లా పరిషత్, అశోక్‌నగర్, పాతబస్తీ అంబేడ్కర్ విగ్రహం, మద్దూర్‌నగర్, గాయత్రీ ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటుంది. ఆటోవాలలు అడ్డదిడ్డంగా ఆటోలు ఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. ఇష్టానుసారంగా డ్రైవింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం కలుగుతోంది. రోడ్డుపక్కన ప్రయాణికులను ఎక్కించుకునేందుకు వెనుక వస్తున్న ట్రాఫిక్‌ను కూడా లెక్కచేయకుండా సడన్‌గా ఆటో ఆపేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో వెనుక ఉన్న ఇతర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆసుపత్రి లోపలి నుంచి వచ్చే రోగులను ఎక్కించుకునేందుకు మరీ పోటీ పడుతూ ట్రాఫిక్‌ను స్తంభింపచేస్తున్నారు. దీంతో ప్రయాణికులు, రోగులు అమ్మో.. ఆటో అని బెంబేలెత్తేలా చేస్తున్నారు. ఇక కొత్తబస్టాండ్ ప్రాంతంలో బస్సులు బయటకు వచ్చే ప్రాంతంలో నడి రోడ్డుపైనే ఆటోలు ఆపేస్తున్నారు. ఈద్గా నుంచి బెటాలియన్ వరకు ఇదే పరిస్థితి. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు నరక యాతనే. కొత్తబస్టాండ్ వద్ద ట్రాఫిక్ నియంత్రించేందుకు ఇద్దరు ముగ్గురు ట్రాఫిక్ పోలీసులు ఉన్నా నియంత్రించలేని పరిస్థితి.

● రోడ్డంతా ఆక్రమణలే

ప్రధాన మార్గాల్లో రోడ్డంతా ఆక్రమణలకు గురవుతోంది. తోపుడు బండ్ల వ్యాపారాలు మొదలుకుని ప్రముఖుల షోరూంల నిర్వాహకులు కూడా ఫుట్‌పాత్‌లు, రోడ్లను సగందాకా ఆక్రమించుకుంటున్నారు. గౌరిగోపాల్ ఆసుపత్రి సర్కిల్ నుంచి సీ క్యాంపు దాకా రోడ్లన్నీ పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. మెడికల్ దుకాణాల నిర్వాహకులు, బైకుల మెకానిక్‌లు ఇలా ప్రతి ఒక్కరూ సైతం ఫుట్‌పాత్‌లతోపాటు రోడ్లను సైతం ఆక్రమించడంతో ఈ ప్రాంతంలో పూర్తిగా రద్దీగా మారిపోయింది. మున్సిపల్ అధికారులు రోడ్లు వెడల్పు చేసి సీసీ రోడ్లను వేసినా పూర్తిగా ఆక్రమించేశారు. దీంతో రూ.కోట్ల నిధులు ఆక్రమణలకే పంచుతున్నట్లుగా పరిస్థితి మారిపోయింది. దీంతోపాటు వాహనాలు పెరగడంతో ట్రాఫిక్ రద్దీ ఎక్కువైంది. బస్టాండు నుంచి బళ్లారి చౌరస్తా వరకు ఇదే పరిస్థితి.

చోద్యం చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు



రోడ్లను ఆక్రమించుకుని వాహనాలు నిలుపుతున్న వాహన చోదకులు దుకాణ నిర్వాహకులపై చర్యలు తీసుకోవల్సిన పోలీసులు ఇటీవల కాలంలో పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నో పార్కింగ్ బోర్డుల దగ్గర వాహనాలు నిలుపుతున్నా కూడా పట్టించుకోకుండా వెళ్లిపోతున్నారు. మరో వైపు మున్సిపల్ అధికారులు కూడా సీసీ రోడ్లను ఆక్రమించుకున్నా కూడా అదుపు చేయలేకపోతున్నారు. దీంతో ట్రాఫిక్ కష్టాలు మరింత ఎక్కువయ్యాయి.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

కదిరిలో ఈ నెల 25న సింహగర్జన

● బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు సోమ్లా నాయక్

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 18: ఈ నెల 25న కదిరి పట్టణంలో లక్ష మందితో బంజారుల సింహగర్జన నిర్వహిస్తున్నట్లు బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు సోమ్లా నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ నాయక్ తెలిపారు. ఆదివారం వారు పత్తికొండలో విలేకరులతో మాట్లాడుతూ బంజారులను పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం గిరిజనులకు అనేక తాయిళాలు ప్రకటిస్తున్నప్పటికీ పాలకులు గద్దెనెక్కాక గిరిజనుల తండాల సంక్షేమాన్ని పాలక ప్రభుత్వాలు మరిచిపోతున్నారని అన్నారు. గిరిజనులు, బంజారులు ఐక్యంగా ఉండి సంఘటితంగా పోరాటం చేసి హక్కుల సాధన కోసం నిలబడాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కార్యదర్శి రాము నాయక్, నాయకులు సత్యే నాయక్, సేవాలాల్ నాయక్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 18: రోడ్డుకు ఇరువైపులా తోపుడు బండ్లు పెట్టుకొని వ్యాపారాలు చేసే చిరు వ్యాపారులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి క్రిష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఆర్ భవన్‌లో చిరు వ్యాపారుల సమావేశం ఈరన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వ్యాపారులకు మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా ఎటువంటి పూచికత్తు లేకుండా బ్యాంకు రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు. ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నెట్టికంటయ్య, నాయకులు రాజప్ప, మాధన్న, చిన్న వ్యాపారస్థుల సంఘం నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో అభివృద్ధి ఏదీ ?

● టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశంలో నాయకులు



టీడీపీ జనసేన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న నాయకులు

మద్దికెర, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి ఏమిటని మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, తాలుకా జనసేన నాయకులు సి.రాజశేఖర్ ప్రశ్నించారు. ఆదివారం మద్దికెర గ్రామంలోని డీపీఏపీ కమ్యూనిటీ హాలులో టీడీపీ, జనసేన ఆత్మీయ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే ఆరు పథకాలతో పేదలకు మంచి రోజులు వస్తాయన్నారు. టీడీపీ, జనసేన ఐక్య సంఘటన రాష్ట్రంలో అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఎన్నికల రణానికి తాము సిద్ధంగా ఉన్నామని, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇంటికి వెళ్లడం తథ్యమని స్పష్టం చేశారు. తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్ గౌడు, జిల్లా టీడీపీ నాయకులు ఎల్.లక్ష్మినారాయణ, జనసేన నాయకులు బద్దల రాజు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజులు, పట్టణ టీడీపీ అధ్యక్షులు గడ్డం రామాంజులు, మదనంతపురం శ్రీనివాసులు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎం. అగ్రహారంలో తాగునీటి కష్టాలు

మద్దికెర, ఫిబ్రవరి 18: ఎం.అగ్రహారం గ్రామంలో 15 రోజులుగా తాగునీరు దొరక్క ప్రజలు తల్లడిల్లుతున్నారని, అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కోదండరాముడు అన్నారు. ఆదివారం మద్దికెరలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో 8వేల జనాభా నివసిస్తున్నారని, తాగునీరందక తల్లడిల్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించకపోతే ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

23 నుంచి మద్దమ్మవ్వ జాతర

మద్దికెర, ఫిబ్రవరి 18: గ్రామంలోని మద్దమ్మవ్వ జాతర ఉత్సవాలు ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్నాయి. 22న అర్ధరాత్రి దాటాక 12 గంటలకు అమ్మవారి ఖడ్గానికి కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో పెట్టి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ నెల 23న శుక్రవారం ఉదయం మూలవిరాట్ మద్దమ్మవ్వకు ఆకుపూజ, ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం చిన్ననగిరికి చెందిన జంబునాథ్ రాయుడు, సంధ్యారాణి, శ్రీనివాసులు, మాదేవి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు.

'ప్రాణాలు పోతున్నా స్పందించని అధికారులు '

ఎమ్మిగనూరుటౌన్, ఫిబ్రవరి 18: విద్యుత్ తీగలు తగిలి ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు నేలను తాకుతున్నాయని, వాటిని సరిచేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్ తీగలు తగిలి మరణిస్తున్నా ఏమాత్రం పట్టించుకోవటం లేదన్నారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, తీగలను సరిచేయాలని పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలుతీసుకోవాలని కోరారు.

ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి

హొళగుంద, ఫిబ్రవరి 18: గజ్జెహళ్లి గ్రామానికి చెందిన బసిరెడ్డి (50) అయిల్ ట్యాంకర్ ఢీకొని మృతి చెందినట్లు స్థానికులు ఆదివారం తెలిపారు. స్థానికుల వివరాల మేరకు.. ఆదోని నుంచి సాయంత్రం బైక్ పై బసిరెడ్డి తన మిత్రుడు శ్రీనివాస్ రెడ్డితో కలిసి స్వగృహానికి వస్తుండగా, గజ్జెహళ్లి క్రాస్ వద్ద ఎదురెదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీ కొట్టినట్లు తెలిపారు. దీంతో బసిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీనివాస్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడికి భార్య సరస్వతమ్మ, కొడుకు సాయికుమార్, కూతురు చైతన్య ఉన్నట్లు తెలిపారు.

తాగునీరు కలుషితం

● రోగాల బారిన పడుతున్న గ్రామస్థులు

● పట్టించుకోని అధికారులు



కలుషిత నీరు పట్టుకుంటున్న మహిళలు

హొళగుంద, ఫిబ్రవరి 18 నెరణికి గ్రామంలో మురుగు నీరు తాగునీటి పైప్‌లైన్‌లో కలుస్తోంది. మురుగు కాలువ పక్కనే పైప్‌లైన్ ఉండడంతో పాటు పైప్‌లైన్ లీకేజీ అవ్వడంతో తాగునీరు కలుషితమై రోగాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తుండడంతో గ్రామంలో నీటిఎద్దడి తీవ్రంగా మారింది. గ్రామశివారులోని బోరుబావుల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయం పై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామ్‌నీలాను వివరణ కోరగా, నీటి సమస్య తీరుస్తామని, అదనంగా మరో బోరు వేస్తామని తెలిపారు.

బరితెగింపు

● తుంగభద్రలో ఇసుక తోడేళ్లు

● వారం రోజులుగా యథేచ్ఛగా తరలింపు

● పట్టించుకోని పోలీసులు, రెవెన్యూ అధికారులు

● సాతనూరు దగ్గర అధికార పార్టీ నేత ఇసుక భోజనం

కోసిగి, ఫిబ్రవరి 18: తుంగభద్ర నదిలో ఈ ఏడాది నీరు లేకపోవడంతో ఓ వైపు పల్లెప్రజలు గొంతెండుతుంటే.. ఇదే అదునుగా భావించిన అధికార పార్టీ నాయకులు తుంగభద్రలో ఇసుకను తోడేళ్లుగా అక్రమంగా తోడేస్తున్నారు. వారం రోజులుగా సుమారు 20 ట్రాక్టర్లలో మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన కాంట్రాక్టరుతో వైసీపీ నాయకుడు అధికారం అడ్డు పెట్టుకుని అధికారుల అండదండలతో యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నాడు. సాతనూరు పంప్‌హౌస్ దగ్గర ఇసుకాసురులు తిష్టవేశారు. ఈ నెల 12న ఆంధ్రజ్యోతిలో తుంగభద్రలో ఇసుకాసురులు అన్న కథనం ప్రచురితమైనా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికార పార్టీ నాయకులు మరింత రెచ్చిపోయారు. వీరి తీరును ఎమ్మిగనూరు, సాతనూరు, సాతనూరు కొట్టాల, జంపాపురం గ్రామాల ప్రజలు అక్రమంగా తరలుతున్న ఇసుకను చూసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారం చేతిలో ఉంటే ఏమి చేసినా అడిగే వారే లేరని రెచ్చిపోతున్నారని శాపనార్థాలు పెడుతున్నారు. ఆయా గ్రామాల ప్రజల ఫిర్యాదు మేరకు ఆర్ఐ శ్రీరాములు తుంగభద్రలో తనిఖీ చేసేందుకు వెళ్లగా ముందస్తు సమాచారంతో నాయకులు ఎస్‌ఏపీ స్కీం దగ్గర ఖాళీ ట్రాక్టర్లను పెట్టుకుని కూలీలతో చేపలు పట్టేందుకు వచ్చినట్లు చెప్పించారు. గుక్కెడు నీటిలో చేపల కోసమమంటూ వలలు వేసినా అధికారులు కిమ్మనకుండా వెనుదిరగడం కొసమెరుపు. ప్రకృతి సంపదను అధికారం అడ్డం పెట్టుకుని వైసీపీ నాయకులు వారం రోజులుగా అక్రమం యథేచ్ఛగా తరలిస్తున్నా అన్ని శాఖల అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.



సాతనూరు దగ్గర తుంగభద్ర నదిలో ట్రాక్టర్లతో తరలిస్తున్న ఇసుక



అధికార పార్టీ నేత ట్రాక్టర్‌లో యథేచ్ఛగా తరలుతున్న ఇసుక

అవినీతి రాజ్యమేలింది : మాజీ ఎమ్మెల్యే బీవీ

నందవరం, ఫిబ్రవరి 18: ఏపీలో ఐదేళ్ల పాటు అవినీతి ర్యాజమేలిందని, అవినీతి రాజ్యాన్ని సాగనంపే సమయం ఆసన్నమైందని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం గురుజాల గ్రామంలో పర్యటించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ సూపర్ సిక్స్ కార్యక్రమం నిర్వహి ంచారు. మహిళలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబు చేసే అభివృద్ధి పనులను గురించి వివరించారు. బీసీలపై ప్రేమ ఎన్నికల సమయంలో మాత్రమే సీఎం జగన్‌కు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కి గుర్తుకు వస్తాయా అని ప్రశ్నించారు. ఇసుక మాఫియ, గ్రానైట్ మాఫియా, గంజాయి మాఫియాలకు రాష్ట్రం కేంద్రంగా మారిందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రల కంటే వెనక పడి పోయిందని తెలిపారు. రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు కూడా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు వలస పోతున్నాయి ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వంగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేసాయి మాదవరావు, బ్రహ్మానందరెడ్డి, గురుజాల శివారెడ్డి, రాయచోటి రామకృష్ణారెడ్డి, నాగలదిన్నె వాహబ్, జబ్బార్, చార్లిస్, నరసింహులు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



గురుజాల ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై దాడి హేయం

● హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

ఆదోని, ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభ కవరేజ్ కోసం వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ క్రిష్ణపై వైసీపీ రౌడీ మూకలు దాడి చేయడం హేయమైన చర్య అని ఏపీయూడబ్ల్యూజే తాలుకా అధ్యక్షుడు మల్లికార్జున, మహేష్, రవికుమార్, వెంకటేష్, దశరథ రాముడు, రామాంజిని, చిన్న, నాగిరెడ్డి అన్నారు. విధి నిర్వహణలో భాగంగా జర్నలిస్టులు ఎక్కడ రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు జరిపినా వెళ్లి ఫొటోలు తీయడం, వార్తలు సేకరించడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. సీఎం జగన్ సభ ఫొటోలు తీసేందుకు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ క్రిష్ణను వైసీపీ రౌడీలు చుట్టుముట్టి విచక్షణారహితంగా కాళ్లతో తన్నడం, పిడిగుద్దులు గుద్దడం చూస్తే చంపాలనే కుట్ర స్పష్టమవుతోందని తెలిపారు వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రశ్నించే వారిపై దాడులు మితిమీరిపోయాయన్నారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా...? రాచరిక పాలనలో ఉన్నామా..? అనే అనుమానం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసుతో పాటు పాత్రికేయ విధులను ఆటంకపరచడంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం నోరు మెదపకపోవడం దుర్మార్గం

ఎమ్మిగనూరు : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకలు దాడిచేసినా సీఎం సభలోనే ఉండి నోరుమెదపకపోవడం అన్యాయమని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి పాత్రికేయులపై భౌతిక దాడులు చేస్తునే ఉన్నారన్నారు. విలేకరులపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడి అని అన్నారు. ఈ దాడిని తక్షణమే సీఎం స్వయంగా ఖండించాలని డిమాండ్ చేశారు.

దాడులు చేస్తే ఊరుకునేది లేదు..

మంత్రాలయం : విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై అల్లరిమూకలు దాడులు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఏపీయుడబ్ల్యూజే మంత్రాలయం నియోజకవర్గ అధ్యక్షుడు జయరాజు, ప్రధాన కార్యదర్శి హుసేని, కోశాధికారి సాబువలి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సూర్యనారాయణ అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు చేయడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. జగన్ పాలనలో జర్నలిస్టులకు స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. అనంతపురం రేంజ్ డీఐజీ, ఎస్పీలు నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏపీయుడబ్ల్యూజే నాయకులు భీమరాయ, రానోజీరావు, రఫిక్, కంతం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు మాయం

● ఆర్టీసీ అధికారుల తీరుపై ఆగ్రహం

● ప్రైవేటు, కర్ణాటక బస్సులే దిక్కు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 18: 'పెళ్లిళ్ల సీజన్.. పెళ్లికి వెళ్దామంటే బస్సులు లేవు.. ఆర్టీసీ బస్టాండుకు వెళ్తే ఒక్క బస్సు కనిపించడం లేదు. ఇక్కడ బస్సులన్నీ ఏమయ్యాయి? ప్రయాణాలు ఎలా సాగించాలో తెలియడం లేదు' అంటూ గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులన్నీ సీఎం సిద్ధం సభ అనంతపురం జిల్లా రాప్తాడుకు తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముందుస్తు సమాచారం లేకుండా బస్సులన్నీ ఎలా తరలిస్తారంటూ అసహనాన్ని వ్యక్తం చేశారు. కొంతమంది ప్రయాణికులు తమ ప్రయాణాన్ని రద్దు చేసుకోగా.. మరి కొందరు అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాల్లో, కర్ణాటక బస్సులను, ఆటోలను ఆశ్రయించి వెళ్లారు. ఆదోని డిపో నుంచి 59 బస్సులు వెళ్లాయి. పత్తికొండ డిపో నుంచి 19, ఎమ్మిగనూరు నుంచి 23 బస్సులు వెళ్లడంతో దూర ప్రయాణాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

ఎమ్మిగనూరు/టౌన్, ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన సీఎం జగన్ సిద్ధం సభకు ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోనుంచే కాక ప్రైవేటు పాఠశాలలు, కళాశాలనుంచి సైతం బస్సులు తరలించారు. దీంతో ఎమ్మిగనూరు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులు లేకపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్‌లో బస్సులకోసం వేచి చూసి రాకపోవటంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో దాదాపు 80 బస్సులు ఉండగా 60బస్సులను తరలించారు. అలాగే ఎమ్మిగనూరు పట్టణం, ఆయా మండలాల్లో ఉన్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులు, మినీ బస్సులు దాదాపు 20వరకు తరలించారు. ఇలా ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులను సీఎం సభకు మళ్లించటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం వారపుసంత జరుగుతుండటంతో వివిధ గ్రామాలనుంచి సంతకు వచ్చే వారు నానా అవస్థలు పడ్డారు. రోజు డిపోకు దాదాపు రూ. 12లక్షల వరకు ఆదాయం సమకూరేది. బస్సులన్ని సభకు వెళ్లటంతో ఆర్టీసీ ఆదాయానికి భారీగా గండి పడింది.



బస్సు లేక బోసిపోయిన ఆదోని కొత్త బస్టాండ్

సిద్ధం సభకు సర్పంచులు దూరం

● రుద్రగౌడ్, అనుచరులు గైర్హాజరు

● బుట్టా తీరుపై ఆగ్రహం

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని పలువురు సర్పంచులు, ముఖ్యనాయకులకు దూరంగా ఉన్నారు. వీరికి సభకు హాజరయ్యేందుకు పిలుపు రాకపోవడంతో దూరంగా ఉండిపోయారు. వైసీపీలో కీలకపాత్ర పోషించిన వారికి కొత్త ఇన్‌చార్జీ బుట్టా రేణుక తీరు నచ్చడం లేదు. తమకు వైసీపీ కార్యలయం నుంచి పిలుపు అందలేదని సన్నిహితుల దగ్గర వాపోయారు. ప్రధానంగా ఎమ్మిగనూరు మండలంలోని కోటేకల్, గుడికల్, మల్కాపురం, దేవిబెట్ట గ్రామాలతో పాటు మరి కొన్ని గ్రామాల నాయకులకు, సర్పంచులకు ఆహ్వానం అందకపోవటంతో వారు కూడా దూరంగా ఉన్నారు. ముఖ్యంగా వీరశైవలింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రుద్రగౌడ్, ఆయన అనుచర గణం సైతం సిద్ధం సభకు వెళ్లకుండా దూరంగా ఉండడం గమనార్హం. గుడికల్ గ్రామంలో ఎమ్మెల్యే వర్గీయులకు అందిన ఆహ్వానం గౌడ్ వర్గీయులకు అందకపోవటం పట్ల ఆయన వర్గీయులు మండిపడుతున్నారు. అలాగే పట్టణంలోనూ గౌడ్ అనుచరులు సిద్ధం సభకు వెళ్లలేదు. కొత్త ఇన్‌చార్జీ రాకతో పార్టీలో బలమైన నాయకులను అణచివేసే కుట్ర జరుగుతున్నట్లు నాయకులు చర్చించుకుంటున్నారు. వీరే కాక మండలంలోని గ్రామాల్లో ముఖ్య నాయకులుగా ఉన్న వారికి కూడా ఆహ్వానం అందకపోవటం గమనార్హం. ఇప్పుడే ఇలా ఉంటే ఇక రాబోయే రోజుల్లో పార్టీ ఇన్‌చార్జి పట్ల నాయకుల వైఖరి ఎలా ఉంటుందో వేచిచూడాల్సిందే.



ఎమ్మిగనూరు మండల కార్యాలయం ఆవరణలో కూర్చొని ఉన్న వైసీపీ నాయకులు

వైభవంగా ఆరాధన మహోత్సవం

మద్దికెర, ఫిబ్రవరి 18: గ్రామ శివారులో కులమతాలకు అతీతంగా నాగాంజనేయస్వామి, గూగూడు కుళ్లాయి స్వామి శిష్యుడు సద్గురు నారాయణ 5వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. గూగూడు పీర్లస్వామి చావిడి నాగాంజనేయస్వామి దేవాలయం ఎదురుగా సమాధి అయిన సద్గురు నారాయణ సమాధికి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం సద్గురు నారాయణ కు పూజలు చేశారు.

● **జీవిత చరిత్ర పుస్తకం విడుదల:**

గూగూడు కుళ్లాయి స్వామి, నాగాంజనేయస్వామి శిష్యులైన నారాయణ జీవిత చరిత్రపై కాలజ్ఞానం రచనలను రిటైర్డు తెలుగు ఉపాధ్యాయుడు జయరాముడు రచించిన 1వ భాగం పుస్తకాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కుమ్మరి పులికొండ, కుమ్మరి వెంకటేశ్, సుబ్బయ్య జయరాముడు తదితరులు ఉన్నారు.

వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి

తుగ్గలి, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో అవినీతి, రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీకి బుద్ధి చెప్పాలంటే ఓటే ఏకైక మార్గమని టీడీపీ నాయకులు పగిడిరాయి బూత్ ఇన్‌చార్జి డీలర్ సుంకన్న అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పగిడిరాయిలో ఓటరు జాబితాను ఇంటింటికి తిరిగి జాబితాలోని తప్పు ఒప్పులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార వైసీపీ పార్టీ దొంగ ఓట్లను చేర్చి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తుందని, ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి దొంగ ఓట్లను వెంటనే తొలగించేలా అధికారులకు తెలియజేయాలని కోరారు.

సీమ ద్రోహి సీఎం జగన్ : కాంగ్రెస్

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 18: సీఎం జగన్మోహన్ రెడ్డి రాయలసీమ ద్రోహి అని, సీమ అభివృద్ధికి చేసింది శూన్యమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతి నాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 26న అనంతపురం జిల్లాకు రానున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పర్యటనను విజయవంతం చేయాలని క్రాంతి నాయుడు విస్తృత ప్రచారం నిర్వహించారు. దేశ అభివృద్ధికి పాటుపడిన కాంగ్రెస్‌ను ఆదరించి అండగా నిలవాలని కోరారు.

జగన్ మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరు



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున చౌదరి

ఆలూరు, ఫిబ్రవరి 18: ఎన్నికల భయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సిద్ధం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ, గొప్పలు చెప్పుకుంటున్నారని, ఎన్ని చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున చౌదరి అన్నారు. ఆదివారం ఆలూరులోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ సిద్ధం సభకు రాయలసీమ జిల్లాలో ఆర్టీసీ బస్సుల తరలింపుతో ప్రయాణికులు ఇబ్బందులకు గురి అయ్యారన్నారు. అన్ని వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. జగన్‌కు ఇవే చివరి ఎన్నికలని, రానున్న ఎన్నికలలో ప్రజలు టీడీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పథకాలతో ప్రజలను మభ్య పెడుతున్నారని, ఎన్ని జిమిక్కులు చేసినా, టీడీపీ గెలుపును ఆపలేరని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ భీమలింగప్ప చౌదరి, టీడీపీ నాయకులు రామప్ప, ఉమాపతి చౌదరి, కర్రెన్న పాల్గొన్నారు.

సిద్ధం సభకు తరలిన వలంటీర్లు

ఆలూరు, ఫిబ్రవరి 18: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనంతపురం జిల్లాలోని రాప్తాడులో తలపెట్టిన సిద్ధం సభకు వలంటీర్లు తరలి వెళ్లారు. వీరంతా వైసీపీ కండువాలు వేసుకొని జనాన్ని తరలించి జగన్ భక్తిని చాటుకోవడం గమనార్హం.

వైభవంగా నవరత్నాల రథోత్సవం



నవరత్నాల రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఫిబ్రవరి 18 : మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై రాత్రి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం మాఘమాస నవమి శుభ దినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి పూర్ణ బోధ పూజ మందిరంలో మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేసి హారతులు ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథం పై వజ్రాలు పొదిగిన ఉత్సవమూర్తిని అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ వైభవంగా ఊరేగించారు.

బంగారు రథంపై మధ్వాచార్యులు

రాఘవేంద్రస్వామి మఠంలో మధ్వాచార్యుల బంగారు రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం మధ్వ నవమిని పురస్కరించుకుని ఉదయం మధ్వాచార్యుల చిత్రపటాన్ని బంగారు రథంపై అధిష్టించి పీఠాధిపతి మహామంగళహారతులతో రథం ముందుకు సాగింది.

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులతో కిక్కిరిసింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి వే లాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది.

అంబులెన్సులోనే ప్రసవం

● తల్లీ బిడ్డ క్షేమం



అంబులెన్సులో తల్లీ బిడ్డలతో 108 వాహన సిబ్బంది

హొళగుంద, ఫిబ్రవరి 18: మండలంలోని కోగిలతోట గ్రామానికి చెందిన బోయ నిర్మల అంబులెన్సులోనే ప్రసవించినట్లు 108 ఏఎంటీ ఎల్లయ్య ఆదివారం తెలిపారు. ఎల్లయ్య వివరాల మేరకు.. కోగిలతోటలో గర్భిణి పురిటి నొప్పులతో బాధ పడుతున్నట్లు ఆశావర్కర్ ఆనందమ్మ నుంచి సమాచారం రావడంతో హుటాహుటిన వెళ్లాము. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రసవం అయ్యింది. ఆడపిల్ల జన్మనించినట్లు తెలిపారు. నిర్మల మొదటి కాన్పు అని, తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని కుటుంబసభ్యులు తెలిపారు. 108 సిబ్బంది ఎల్లయ్యను ప్రత్యేకంగా అభినందించారు.

జూపూడి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

గోనెగండ్ల, ఫిబ్రవరి 18: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కన్న డబ్బే ముఖ్యం అన్న జూపూడి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు అమ్రేష్ డిమాండ్ చేశారు. ఆదివారం గోనెగండ్ల లో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విదేశీవిద్య పేరును తొలగించి జగన్ విదేశీ విద్యగా మార్పు చేసిన విషయంపై జూపూడి ప్రభాకర్ మచిలీపట్నంలో అంబేడ్కర్‌ను కించపరిచేవిధంగా మాట్లడటం తగదని పేర్కొన్నారు.